# ఈ రేయి నిలిచిపోరా...



రంగి చాలాసేపటిగా అతన్ని చూస్తూనే ఉంది.

'అతనిపాటికి అతను ఏవో ప్రశ్నలు అడుగుతున్నాడు. తనేవో సమాధానాలు చెబుతోంది. తను చెప్పినదాన్నిబట్టి కాగితాల మీద రాసుకుంటున్నాడు. మళ్ళీ అడుగుతున్నాడు. తన సమాధానం విని 'ఇందాకా అలా చెప్పేవేం?' అంటున్నాడు. తనేం చెప్పిందో తనకు తెలిసి ఛస్తేగా! అతను వచ్చిన దగ్గర్నుంచీ గుండె గుబులుగానే ఉంది. భలే అందగాడు. గవర్నమెంటు ఆఫీసరుట. ఈ కొండల్లో ఉండేవాళ్ళ బతుకు బాగుచేయడానికి అప్పులిచ్చే అధికారట. ఆ ఒడ్డూ, పొడుగూ, ఎఱ్ఱటిశరీరం, తెల్లబట్టలూ, ముఖం మీద చిన్న చిరునవ్వు - మంచివాడిలాగే ఉన్నాడు.

ఎంత మంచివాడు కాకపోతే, గుడిసెలో తను తప్ప ఎవరూ లేరని తెలిసినా, వెఱ్ఱి మొఱ్ఱి చూపులు చూడకుండా సూటిగా తన ముఖంలోకే చూసి మాట్లాడుతాడు? ఆ చూపులే భలే అందంగా

ఎమ్బీయస్ ప్రసాద్

ఉన్నాయి. టూరింగ్ టాకీస్‌లో వేసే సినిమా హీరోలా ఉన్నాడు. ఈ బాబు పెళ్ళం ఎలా వుంటుందో. ఆవిడా, పిల్లలూ కూడా మల్లెపూలలా ఉండి ఇంగ్లీషూ, తెలుగూ చకచకా మాట్లాడేస్తుంటారు కాబోలు. ఇంట్లో అలాటి ఆడది ఉంటే తనలాటి వాళ్ళ కేసి ఎందుకు చూస్తాడీయన? నల్లటి రంగు. చదువు, సంజా లేదు. నోరిప్పితేనే చాలు, మొద్దని తెలిసిపోతుంది. ఉండేది గుడిసెలో, చేసేది బుట్టలల్లే పని. మొగుడెవడ్రా అంటే చీవుళ్ళు అమ్ముతాడు.

అతని కంటికి తనెలా అనుతుంది? 'అసలు వయసులోని ఆడది, గూడేనికి దూరంగా బిక్కుబిక్కుమంటూ ఉన్న ఒంటరి గుడిసెలో ఒకత్తే ఉంది, ఒంపుసొంపులతో ఉంది, ఓ చెయ్యేసి చూస్తే ఏమవుతుంది పెద్ద..' అన్న ఆలోచనే రాలేదు పెద్దమనిషికి. అతన్నని ప్రయోజనం ఏముందిలే, ఒంపుసొంపులు తనేమైనా కనబర్చిందా ఏమన్నానా? సినిమాలు చూసాక రవిక తొడగడం అలవాటయింది, ఇంకేం కనబడతాయి? అయ్యో, అతను వెళ్ళిపోతున్నాడే, పని అయిపోయిందేమో....'

"వస్తాను, మీ ఆయన ఊర్నుంచి వచ్చాక మా ఆఫీసుకొచ్చి కనబడమను. లోనివ్వడానికి వీలవుతుందేమో చూస్తాను." అంటూ బయటకు వచ్చి మోటరు సైకిలు స్టార్ట్ చేయబోయేడు మోహన్రావు.

రంగి తలవూపింది మౌనంగానే. కళ్ళల్లో దిగులు. కొద్దిగా కన్నీళ్ళు, చీకటిపడ్డం వల్ల అతనికి కనబడలేదేమో. కనబడితే ఆగి చూసేవాడేమో. అంతలోనే ఆమె కళ్ళల్లో వెలుగు. మోటరుసైకిలు చెడిపోయింది. కేబుల్‌వైరు తెగిపోయినట్టుంది.

"ఇక్కడ బాగు చేసేవాళ్ళెవరైనా ఉన్నారా?" అన్నాడు మోహన్రావు కంగారుపడుతూ.

"లేరు, బాబూ. గూడేం వేపెళ్ళినా లాభం లేదు. ఇటువైపంతా తుప్పలు. తోసుకెళ్ళడం కష్టం. రాత్రికక్కడ ఉండిపోయి, పొద్దున్న గూడెం నుంచి కుర్రాళ్ళను పిలుసుకొస్తే ఆళ్ళు తీసికెళ్ళి బాగు చేయిస్తారు." అంది రంగి.

అతను తిట్టుకున్నాడు. మోటరు సైకిలుతో తంటాలు పడ్డాడు, కానీ రంగి ప్రార్థనలు దేవుళ్ళు విన్నట్టున్నారు. అది బాగుపడలేదు. "రాత్రికి నేనిక్కడ ఉంటే నీకు ఇబ్బంది లేదు కదా" అన్నాడు బిడియపడుతూనే.

"బలేవోరు, ఎవరికి తెలుస్తుంది కనక. నాతో పాటే తిని, తొంగుదురు గాని ఈపూటకి ఏదో మా కాదున్నదే పెడతా. రండి ఆ బండి ఈ పక్కగా లాగేయండి, ఎవరికీ కనబడకుండా ఉంటది." అంటూ రంగి హడావుడి చేసింది.

ఓ గంటయ్యేసరికి మోహన్రావు స్నానం చేసి, తువ్వాలు కట్టుకుని రంగి చేతి భోజనం చేస్తున్నాడు. రంగి వడ్డిస్తోంది. స్నానం చేశాక రవిక వేసుకోలేదామె. ఒకటే ఉందట. పొద్దున్న వేసుకుని వెళ్ళే పని ఉందట. అడక్కపోయినా చెప్పింది. చెప్పాక మోహన్రావు చూపులు రవిక ఉండవలసిన స్థానాన్ని వదలలేదు. వంగి వొడ్డించేటప్పుడు మరీనూ. రంగి పట్టించుకోనట్టే ఉంది. బుడ్డిదీపం వత్తి మాత్రం పైకే పెట్టింది. దీపం వెలుగులో ఆమె వంపులు మెరుస్తుంటే అతను అలా చూస్తూనే ఉండిపోయాడు.

అతని భోజనమయేక తనూ చేసి, అతని నులకమంచం దగ్గరగా వచ్చి నిలుచుంది. "పాపం అమ్మగారు దగ్గర్లేకపోతే బాబుగార్కి నిద్రపట్టదేమో. మా గూడెంలో చూద్దామా అంటే కాస్త కను ముక్కు తీరున్న వాళ్ళే కనబడరు. ఇయ్యాల ఏం చేస్తారో, ఏటో." అంది చిలిపిగా నవ్వుతూ.

ఆమె కొంటెతనం చూసి మోహన్రావుకి ముచ్చట వేసింది. సగం లేచి, అరచేతిపై తలాన్చుకుని, "ఏం, నా ఎదురుగుండా ఉన్నమ్మాయికి కనుముక్కుతీరు బాగానే ఉందే!" అన్నాడు నవ్వుతూ, రంగి సిగ్గుపడిపోయింది. "బాబుగారు పరాసికాలాడుతున్నారు. నానేవిటి? మీ ఆడాళ్ళతో సాపత్తమేమిటి?" అంది వంకర్లు తిరిగిపోతూ.

"సాపత్యమెందుకు? ఎవరి అందం వాళ్ళదే. మీకున్న ఛాతీ, చంకా సిటీలో ఉన్నవాళ్ళలో ఎంతమంది కుంటుంది?" అన్నాడు మోహన్రావు.

"బాబుగారు సరిగ్గా సూడకుండానే చెప్పేస్తున్నారే, దగ్గరగా వస్తే కదా తెలిసేది" అంది రంగి ఒక

అడుగు ముందుకు వేసి. మోహన్రావుకి ఇంతకంటే పిలుపు అక్కర్లేకపోయింది. ఒక్క అంగలో ఆమెను చేరుకున్నాడు. ఐదు నిమిషాల్లో ఆమె ఒంటినంతా పరామర్శించేసాడు. రంగికూడా నిట్టూర్పులు విడుస్తోంది. "చీకటి, జాగ్రత్తగా చూసుకోండి... నులక మంచం వద్దు, తుంగ చాపేస్తాను" అంటూనే అతని తువ్వాలు తీసేసి బుట్టమీద పడేస్తోంది. ఆమెను చాపవేయడానికి కూడా వదలటం లేదు మోహన్రావు. ఒళ్ళంతా నలిపేస్తున్నాడు. ఎంత నలిపినా ఆమె అడ్డు చెప్పకపోవడం, ఫిగర్ గురించి వర్రీ కాకపోవడం అతనికి మరింత మత్తిచ్చింది. "రంగీ, నువ్వు భలే నచ్చావు నాకు. నీకు తప్పకుండా లోనిస్తాను చూడు. నన్ను తృప్తిపరచిన వాళ్ళెవరికీ నేనన్యాయం చేయలేదు. లోను తీసుకొని, గొర్రెల వ్యాపారం పెట్టుకున్నావంటే నా సామిరంగా..."

రంగి గుండె కలుక్కుమంది. 'అంటే ఈ బాబు, ఆయనిచ్చే అప్పుకోసమే ఇదంతా అనుకుంటున్నాడా? ఛ, బతుకు చెడ...'

రంగి దూరంగా వెళ్ళిపోతూంటే మోహన్రావుకి ఏం జరిగిందో తెలీలేదు. మీద పాంటు, చొక్కా పడుతూంటే ఏం చెయ్యాలో తోచలేదు. చీకట్లో రంగి మొహంలో భావాలు చదవడం అసాధ్యం. 'ఏమయింది, వాళ్ళ వాళ్ళెవరైనా వచ్చిన అలికిడయిందా?' అనుకుంటూండగానే, "బాబూ, బట్టలేసుకొని బయల్దేరండి బాబూ, రోడ్డుమీద ఓ అరమైలెళితే మెకానిక్కు కుర్రాడుంటాడు." అంది రంగి.

"ఏం, ఏమయింది రంగీ, ఇప్పటిదాకా బాగానే ఉన్నావుగా. రా, దగ్గర రా. మాట, నీ కే లోను కావాలంటే అదే...."

" మళ్ళీ అదే పాడుకూత. నీలోను నీకాడే పెట్టుకోవయ్యా, పెద్దమనిషీ. ఏదో మంచోడవని మనసు పడ్డాను కానీ, ఉజ్జోగం అడ్డెట్టుకొని ఆడాళ్ళ వెంటబడే వోడి వనుకోలేదు. పెద్ద ఇచ్చేసాడయ్యా లోను. నా పిక్క మీద ఎంట్రుకపాటి సేయదు నీ లోను. అది లేకపోతే ఇన్నాళ్ళూ బతకలేకపోయినామా? ఏదో కుర్రాడు ఎర్రగా, బుర్రగా ఉన్నాడని బెమిసినందుకు మాబాగా బుద్ధి సెప్పావులే, పద, పద."

"ఐ యామ్ సారీ, అది కాదు నా ఉద్దేశం, ఈరాత్రి ఎలాగు వెళ్ళలేను కదా, సరైన రోడ్కూడా లేదన్నావు. ఇక్కడ పడుకుంటాను. నీ కిష్టమయితేనే... ఒక్కసారి...."

"రోడ్ ఉందిలే. అదిగో ఆ తుప్పల వెనకాల తార్రోడ్డే. ఇవాళ నిన్నుంచేసుకుందామని ఇందాకా చెప్పలేదు. బండి అక్కడదాకా తోసిపెట్టమంటే తోసిపెడతా గానీ, నన్నింకేవీ ఆడక్కు. కోపం వత్తే కుక్క నుసి గొలువుతా జాగర్త." అంది రంగి.

మోటర్ సైకిలు తోసుకుంటూ వెళుతున్న మోహన్రావు కళ్ళముందు అందినట్టే అంది, అందకుండాపోయిన రంగి అందాలు ఆడుతూనే ఉన్నాయి.

●

(ఆంధ్రప్రభ వీక్లీ డిసెంబరు 1997)